

# తప్పెవరిది?

కుమారి ఎస్. రంజానీబి

సాయంకాలం ఐదుగంటల సమయంలో మోకాళ్లపై తలపెట్టుకొని నేలను చూస్తూ ఇసుకలో పిచ్చిగీతలు గీస్తూ బీచ్‌లో కూర్చున్నదామె. పొడవుపాటి ఆమె జడ వీపుమీదినుండి జారి భూమితో ముచ్చట్లాడుతున్నట్లుగ ఆమె కదులుతున్నప్పుడల్లా జడ కదులుతుంది.

మహావాని స్వచ్ఛమైన జీవితానికి ప్రతీకగా సముద్రం నురగలు కక్కుతూ కనుచూపుమేర తెల్లనిబట్ట ఆరవేసినట్లుగావుంది. చెట్లలోనుండి దోబూచులాడే సూర్యకిరణాలు సముద్రునితో మంతనాలు జరుపుతున్నట్లుగా ఆ కిరణాల వేడికి వాడికి అలలు పరవశించి ప్రణయగీతాన్ని ఆలాపిస్తున్నట్లు ఆనందంతో ఎగిరి గంతులేసి విరిగిపోతున్నాయి రెప్పపాటులోనే.

భారత దేశంలోని కరువంతగా వున్నది ఆమె ఎదురుగావున్న సముద్రం! 'సముద్రంలోని గాంభీర్యత, సముద్రమంత విశాలత, సముద్రపులోతు అందరికి వుంటాయా?' అనుకున్నాదామె తలెత్తి సముద్ర లాస్యవిలాసాలను మూగగా చూస్తూ...

'అంతటి విశాలహృదయం యీ విశాల ప్రపంచంలో ఏందరికుంటుంది?' అని మరోమారు గొణుక్కుంది.

తలెత్తి నలువైపులా ఒక్కసారి తేరిపార చూచింది ఆమె. దూరంగా వూసులాడుకుంటున్న జంటల జంటల మనుష్యులు! ఆనందంతో కేరింతాలు కొడుతూ ఆడుకొంటున్న పిల్లలు! ముసిముసి నవ్వులతో గుసగుసలాడు కొంటున్న ప్రేయసీ ప్రియులు! అందరి హృదయాలలో ఆనందమే! అందరి మనసులలో సెలయేటి గలగలలే! అంతా కోలాహలమే!

ఏదురుగా వున్న సముద్రం ఆంధ్రప్రజలెందుకిలా ఐక్యమత్యాన్ని కోల్పుతున్నారు? అన్నట్లుగా ఘోష పెడుతుంది.

ప్రపంచంలో జరిగే అన్యాయాలను అక్రమాలను మేము చూడలేక పోతున్నామన్నట్లు ఆక్రందన చేస్తున్నట్లున్న అలలు ఎగిసి ఎగిసి పడుతున్నాయి!

ఆమె హృదయంలోనూ సముద్రఘోషలాంటి ఘోషే!

పరితాపంతో తపించి పోతున్న దా

దేశంపై ద్వేషంతో తల్లడిల్లి పోతున్న దామె!

మోసం చేసే మనుషులపై చీదర భావంతో చింతిల్లుతున్న దామె!

రెండు చేతులను కాళ్లకు చుట్టుకొని మరోసారు ఆమె శూన్యంలోకి చూస్తూ ఏవేవో అర్థాలను పరామార్థాలను వెతుకు తున్నదామె!

పెనుతుఫానులకు, ఫిరంగులకు కూడ కదలలేని ఓ భయంకర పర్వతంలా నిశ్చింతగ నిర్భయంగ కూర్చుండి పోయిందామె.

దూరంగా కాలేజీ పిల్లలు అలలపై బంతి ఆట ఆడుతూ గెంతుతూ కేరింతలు కొడుతూ ఆడుకొంటున్నారు.

సృష్టిలోని సర్వ రహస్యాలు తెలిసిన ఓ దివ్యజ్ఞానిలా సన్నగా నవ్వుకున్న దామె! ఆ పిల్లలలో ఆపుకోలేని ఆనందం! వళ్లు తెలియని పరవశత్వం మాత్రమే వున్నది!

వయస్సులో వున్న యువతికి మనస్సు తుళ్లటం సహజమే! తత్ఫలితంగా కాలు జారితే ఎంతగా 'కుళ్లి కుళ్లి ఏడ్వవలసి వస్తుందో వాళ్లకేం తెలుసు పాపం! వాళ్లకిప్పుడు తెలిసినదల్లా తుళ్లటమే! సెలయేరులా పరుగులిడే పరువం! నాగు బాములా కుబుసం విడిచే వయసు! ఆ వయసు కది సహజమే!' అనుకుంది నిర్లిప్తంగా...

ఆమెకు నాలుగు గజాల దూరంలో ప్రేయసీ ప్రియులు గాబోలు ప్రియుని తొడమీద ప్రేయసి పడుకొని కనరాని లోకాలలోకి తేలిపోతున్నట్లుగా అనంతమైన ఆకాశంలోకి ఆశగా ఏదో వెతుకుతున్నట్లుగ చూస్తుంది. ఆమెలో ఆనందం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. 'తనకా భాగ్యం లేదు కదా!' గొణుక్కుంది ఆమె! ఎటు చూచినా ప్రశాంత వాతావరణం. మనసుకు, శరీరానికి హాయి నిచ్చే చల్లటి గాలి. చూచినంత మేరలో కన్నుల పండువ చేసే రకరకాల దుస్తులతో జనం! ఎటు చూచినా ఆనందంగా వున్న ఆమెకు మాత్రం ఆనందం లేదు ఆమె మనస్సు బాండీలో కళ పెళ కాగే నూనెలా వుంది.

ఆమె గొంతులో వున్నది అమృతంకాదు. హాలాహలం!

ఆమె వయస్సు ముప్పయిలోపు! పసుపు శరీరఛాయ. తియ్యని వలపుల తలపులకు వావిపోయినట్లున్న చెక్కిళ్లు! ఏడ్చి ఏడ్చి అలసిపోయినట్లున్న ఆమె విశాలనేత్రాలు ఆ రోజు కాటుకదిద్దిన మూలంగా వింతగ మెరిసి పోతున్నాయి. కుంచెతో తీర్చిదిద్దిన నొసలు! పాలభాగాన విలువపాటి బొట్టు! కోలముఖమైనా కొన దేలిన ముక్కు ఆమె సౌందర్యవతి అని చాటి చెబుతుంది.

దుర్మార్గులైన మానవులను కబళించాలని విశ్వప్రయత్నం చేస్తూ నాగు బాములా నోరుతెరచి బైటకువస్తున్న అలలు! బైటకువచ్చి ఆమెపాదాలను తాకి మరీ వెళ్లిపోతున్నాయి.

గాలివాటుకు దూరానవున్న జంట చెప్పుకుంటున్న మాటలు ఆమె చెవులను తాకుతున్నాయి.

'ఆమె మా ఫిజిక్సు మేడమ్!' అన్న దామె!

'అలానా? పేరేమిటి?' అతని ప్రశ్న.

'మంజుల' కిల కిలా నవ్విందామె.

ఆ నవ్వు నాగుబాము బుసలుగా చెవులకు తాకింది.

'ఏం! అలా నవ్వుతున్నావు?' అతడి కంఠం.

'ఆమె దొకవింత కధలే!' హేళనతో నిండిన నవ్వు!

ఆమెగొంతు నలిపివెయ్యా లనిపించింది మంజులకు. ఆమె మాటల బాణాలకు మంజుల మనస్సు తూట్లు పడిపోయింది. ఆమె కడుపులో అగ్నిజ్వాలలు వ్యాపించాయి. రోషం, పౌరుషం ఆవేశంతో కూడుకున్న ఆమెమీద ఎగిసి ఎగిసి పడింది. మరల తన అసహాయతకు, వెలితితనానికి, చేదుగా సాగిపోయే తన జీవితానికి విచారించక విస్పారంగా నవ్వుకుంది.

ఆ నవ్వులో జీవంలేదు!

కళాకాంతులు అంతకన్నా లేవు!

వాళ్లమాటలకు చంద్రబింబంలాంటి ఆమె ముఖంలో రంగులుమారి పాండురోగం మనిషిలాగ ఆమె ముఖం పాలిపోయింది. మనస్సు మూగబోయింది.

'ఛీ ఎందుకలా బేలవై పోతున్నావు? అంతలోనే బాధపడాలా?' అన్నది ఆమె లోని పౌరుషం!

'బేలపడక ఏముంది! వాళ్లన్నట్లు నాదొక వింతకధేగా?' అన్నది ఆమెలోని శాంతం!

పౌరుషానికి—శాంతానికి మధ్య పది నిమిషాలు ఘర్షణ జరిగింది ఆ ఘర్షణతాలూకు శాంతమే నెగ్గింది.

బ్రతుకు దుర్భరంగా నిస్సారంగా సాగిపోతున్నప్పుడు మనిషి అలవర్చుకోవలసిన సుగుణం శాంతం ఒక్కటే! అశాంతితో అలమటించే వారిపాలిట శాంతం అమృత ప్రాయమైనది.

కాలం ఎప్పుడూ ఒక్కలాగే వుండదు! కాలంలో ఋతువులు మారుతున్నట్లే మనిషివయస్సు పోటీపడుతూ పెరిగిపోతూనే వుంటుంది.

మంజుల గుప్పిటలోకి ఇసుక తీసికొని కుప్పలు కుప్పలుగిపోస్తూ తన గత విషాద జీవితానికి నాందీగా సన్నగా ఏడుస్తూంది. అలా చాలాసేపు యేడ్చింది. కళ్లు తుడచుకుంది. తన కంటినీరు తనే తుడుచుకోవాలి. ఎందుకంటే తుడిచేవారు ఆమెకు లేరు!

రివ్వున వీచేగాలి తాకిడికి ఆమెపమిట మహాత్ముడు దేశానికి ఇచ్చిన సందేశంలా ఏదో సందేశమిస్తున్నట్లు రెపరెపలాడుతుంది. మోముపై ముంగురులు నాట్యం చేస్తున్నాయి. సముద్రపు ఘోషలో మార్పులేదు. అలలు ఎన్నటికీ ఆగిపోవు! అలాగే ఎదలోపలి వేదనకూడ ఆగదు! బైటకు ఏదోఒక రూపేణా కక్కివేయాలనిపిస్తుంది. ఆమె ఆలోచిస్తూనే వుంది.

ఆమె భుజంపై చల్లని చేతిస్పర్శ తగలటంతో తలెత్తి పైకి చూచింది! 'మేడమ్! మీరా?' అన్నది ఆశ్చర్యాన్ని ఆవేదనను పైకి కనబడ నీయకుండ నటిస్తూ...

'ఆవేదనను దాచిపెట్టటానికి ప్రయత్నం చేయటం అవివేకమమ్మా!' అన్నది మంజుల తలనిమురుతూ...

ఆత్మీయులను చూచినప్పుడే ఆవేదన ఎక్కువౌతుందన్న మాట మంజుల విషయంలో అక్షరాల జరిగి తీరింది. ఆమెలో జ్వాలలా రాజుకుంటున్న వేదనకు చిహ్నంగా జలజలా కన్నీరు చెంపలమీదుగజారి వక్షస్థలాన్ని తడిపివేస్తున్నాయి.

ఆమె రాకతో మంజుల దాదాపు పిచ్చిదైపోయింది. వసుంధరా మేడమ్ ఈవింత విచిత్ర పరిణామానికి ఆశ్చర్య

పడి కలవరపాటు చెందింది.

మంజుల ప్రక్కగా కూర్చుంటూ ఆమె ముఖాన్ని పట్టుకొని తనవైపు తిప్పుకుంటూ 'ఇలా ఒక్కసారి నావైపు చూడు!' అన్నది మంజుల కళ్ళల్లోకి ఆమెకూడ చూస్తూ...

వసుంధరమేడమ్‌కు వలెళ్ళి పీళ్ళు దాటకపోయినా డెబ్భయిఏళ్ళ అనుభవం ఆమెలో దాక్కొనివుంది. అంతేకాదు ఆమె ఆర్తులపాలిట దేవత! అనాధులపాలిట కల్పతరువులాటిది. పండిన అనుభవాలకు చిహ్నంగా ఆమెలోని జుత్తు అక్కడక్కడ నెరిసిపోయింది. ఆమె కళ్ళల్లో ప్రేమ లాలిత్యం కన్పిస్తూ వుంటాయి. బాధతో వేదనతో కృంగిపోయేవాళ్ళకు బ్రతుకుమీద ఆశను కల్పించి వారిని ధీరులుగా నిలబెట్టి జీవితంలో ఎన్ని సుడిగుండాలనైన ఎదుర్కొనేటట్లుగ వాళ్ళకు సలహాలివ్వటం ఆమెలోని ఆయుధం. తన చల్లనినీడ లాంటి ఆప్యాయతతో ఆర్తిని బాపుతుంది. మాటలలో అనురాగాన్ని ఒలకబోస్తూ తూచితూచి ఎదుటివ్యక్తిని నొప్పింపకుండా మాట్లాడటం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. మంచితనం ఆమెసొత్తు.

మంజుల వసుంధర దాదాపు నాల్గు సంవత్సరాల నుండి ఒకే కాలేజీలో లెక్చరర్లుగా చేస్తున్నా, మంజుల తన స్వవిషయాలు బాధలు ఎన్నడూ వసుంధరా మేడమ్‌తో చెప్పలేదు! చెప్పవలసిన అవసరం కూడా అప్పట్లో అంతగా లేకపోయింది. అప్పుడప్పుడు మంజులలో గల నైరాశ్యం, నిర్లిప్తత, దిగులు వసుంధర మేడమ్ కనిపెట్టక పోలేదు. కాని ఒక విషయాన్ని గురించి ఆరాలు తీసి చర్చించి ఎదుటి వ్యక్తిని బాధ పెట్టటం వసుంధర తత్వం కాదు. ఆమెకు తెలిసిందల్లా ఒక్కటే! సాధ్యమైనంతవరకు ఎదుటి వ్యక్తిని బాధ పెట్టకుండ మాట్లాడటమే! అందుకనే మంజులలో ఏదో బాధ గూడుకట్టుకుని వుందని గ్రహించినా, ఇన్నాళ్ళ నుండి ఆమె అడగలేక పోయింది!

ఈ నాటికి మంజులలోని వేదనంతా వెళ్ళ గక్కే సమయం రానే వచ్చింది. దేనికైనా సమయమంటూ రావాలి!

మంజుల కార్చే కన్నీటిబొట్లు రెండు ఇసుక మీద పడి ఇంకి పోయాయి.

# తప్పెవరిది?

మేడమ్ కళ్ళల్లోకి మంజుల తీక్షణంగ చూచింది.

'ఈమె నా కథంతావిని నన్ను చీదరించు కోదుకదా! ఈమెనుండి నాకు సానుభూతి లభిస్తుందో లేదో!' అని ఆ చూపులోని అర్థం. ఆమె సంశయంకూడా అదే!

ఇసుకలోకి వేళ్ళు గుచ్చి నొక్కిపెడుతూ 'మేడమ్!' అన్నది సన్నగా...

మంజుల కంఠంలో ఆర్ద్రత, బాధ ధ్వనించాయి.

'ఏమ్మా! ఏమిటి నీబాధ చెప్పు!' అన్నది ఆమెమాటలో లాలిత్యాన్ని ప్రేమను నింపి.

అటువంటి అనురాగ పూరితమైన మాటకు మొగమువాచిన మంజుల ఒక్కసారిగ వసుంధరను కావలించుకొని భోరున ఏడ్చింది.

సహజంగా మనిషి వేదనతో వలిగి పోయేటప్పుడు అంతస్తు, విలువ, హోదా, అధికారం వీటి వేటినీ కూడ వాంఛించడు. దైన్య పరిస్థితులలో వున్న మనిషికి కావల్సింది, స్వస్థత చేకూర్చే తియ్యనిమాట. చల్లని స్పర్శ అమృతంలాటి ఆర్ద్రత మాత్రమే కోరుకుంటాడు.

అలాగే ఇప్పుడు మంజులకు కావాల్సింది. అనురాగంతో ఆప్యాయతతో కూడుకున్న ఓ తియ్యని పలుకు మాత్రమే!

వసుంధర ఆమె వీపు పైచేయి వేసి రుద్దుతూ! 'చూడమ్మా మంజూ! నీవన్నీ తెలిసిన దానివి! కొన్ని వందల మంది విద్యార్థులకు విద్యామృతాన్ని పంచిపెడుతున్న నీవు ఇలా పసిపిల్లలా ఏడ్వటం బాగుండలేదు. మనిషికి బాధలు వుండటం సహజం. సంఘంలో నీకున్న విలువేమిటో తెలుసా? నీవొక లెక్చరర్‌వి! కావలసినంత డబ్బు, పలుకుబడి వున్నాయి! నీ విలువను నీవు గుర్తించుకోలేక బాధపడుతున్నావా?' అన్నది ఆమె నుదుటిపై హాస్యం చేస్తున్న ముంగురులను సవరిస్తూ...

'డబ్బుతో ఆప్యాయతను మమకారాన్ని కొనుక్కోగలమా మేడమ్!' అన్నది ఆవేశంగా...

సముద్రపు అలలు అవిరామంగా సాగిపోతునే వున్నాయి. చల్లని గాలికి మనస్సుకు కొంత సాంత్వన చేకూరుతున్నా ఏదో తెలియని మంట, ఆరాటం ఆమెను తొందర పెడుతున్నాయి.

'నీ బాధేమిటో చెప్పవా మంజూ! నేను నీ తల్లిలాంటి దానను కాలేనా? ఎందుకిలా సంశయిస్తావు?' అన్నది మంజుల దగ్గరకు జరిగి కూర్చుంటూ...

'మేడమ్! మీకన్న ఆప్తులు, శ్రేయోభిలాషులు నాకీ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. మీకు చెప్పుకొని వూరట చెందటమే నాకిప్పుడు మిగిలింది.

మంజుల చెప్పటం ప్రారంభించింది.

* * *

ఎప్పుడైనా ప్రపంచంలో స్వార్థం, స్వలాభం, స్వప్రయోజనం చూచుకొనే మనుషులే సుఖపడతారు మేడమ్! స్వార్థం లేకపోతే మనిషిలేడు. ముఖ్యంగా స్త్రీమరీ స్వార్థపరురాలు.

సరిగ్గా ఆరుసంవత్సరాలక్రితం నేను బెజవాడ లయోలా కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్న రోజులవి! యూనివర్శిటీ వాళ్ళు యిచ్చిన డిగ్రీతో ఉద్యోగంచేస్తున్నానన్న మాటేగాని నాలో ఊహాశక్తి, భావనాశక్తి జీవితన్నిగురించిన ఆలోచనలుగాని వుండేవి కావు.

అప్పట్లో నేనొక స్త్రీననిగాని, వివాహం చేసికోవాలన్న తలంపుగాని, ఆలోచనగాని నాలో లేవు. మామూలుగా పదిగంటలుదాటిన తర్వాత రంగన్న అరేంజ్ చేసిన భోజనం ముగించి కాలేజీకివెళ్ళటం, ఆ రోజు సిలబస్‌ప్రకారం పాఠాలు క్లాసుల వారిగచెప్పటం, సాయంకాలం యింటికి వచ్చి స్నానం భోజనం ముగించి, కొంత నోట్సు వ్రాసికొని ఆతర్వాత ఏవేవో పుస్తకాలు చదవటంలో మునిగిపోయి ఎప్పటికో నిద్రపోవటం నాకు బాగా అలవాటు.

ఆరోజు శుక్రవారం, తలంటిపోసికొని నాకిష్టమైన పాములాంటి తెల్లటి చారలతోవున్న ఆకుపచ్చని చీర, అదే కలరు బ్లౌజ్ వేసికొని నాలుగైదు గులాబీలు గుత్తిగాకట్టి తలలోపెట్టుకొని నా ప్రతిబింబాన్ని అద్దంలో ఐదారుసార్లు చూసుకొని నేను ఎంతగానో మురిసిపోయానా రోజు.

రైవ్‌ళు రిక్షా కోటయ్య వీధిలో

# తప్పెవరిది?

కొట్టటం వినిపించగానే పుస్తకాలు, హేండ్ బేగ్‌తో వెళ్లి రిక్షాలో కూర్చున్నాను. రిక్షా కాలేజీవైపు పోతోంది!

అయ్యమని రొదచేసికొంటూ ఒక్క ఉదుటున నా రిక్షాకు గజందూరంలో ఓ స్కూటర్ సడన్‌గా ఆగిపోయింది రిక్షా చక్రం ఒకటి ప్రక్కకు వంపు తిరిగింది. స్కూటర్‌మీద మనిషి ఎగిరి గంతేసినట్లు స్కూటర్‌దిగి రిక్షావాడితో 'ఏయ్! నీకు వినిపించటంలేదా? హారన్ దిన్నిసార్లు మోగిస్తున్నా సైడ్ యివ్వకుండానే అలాగే పోనిస్తావేమిటి?' అన్నాడతను అధికారాన్ని, కోపాన్ని కంఠంలో మేళవింపజేసి.

ఆ అపరిచిత కంఠధ్వని వీణలు మ్రోగినట్లు వినిపించడంతోనే నేను కొంచెం తల బైటకుపెట్టి ఆవ్యక్తిని చూశాను. అంతే! ఏదో విద్యుత్తు నాలో ప్రవహించినట్లయింది. పొడవుపాటి విగ్రహం. నీలం ప్యాంటుమీద తెల్లటి షర్టు. గట్టిగా పుచ్చులా కట్టిన టై. బిగువైన అంగసౌష్టవంతో మెలమెలలాడుతున్న మనిషి! కళ్లకు కూలింగ్‌గ్లాసెస్‌తో కన్నులపండుగా వున్నాడతను!

ఆసమయంలో అతనొక దేవతామూర్తిగా నాముందు సాక్షాత్కరించినట్లే అనిపించింది క్షణకాలం. మాయిద్దరి కళ్లూ కలిసికున్నాయి మనసులు ఏవేవో తెలియని భాషతో గుసగుసలాడుతున్నాయి. అతను నన్నే చూస్తున్నాడు. ఆవాడిచూపుల బాణాలకు తట్టుకోలేక నాచూపులను ప్రక్కకు మరల్చుకున్నాను. నాచేతులు కాళ్లు ఏదో తప్పుచేసిన దానిలాగ కంపించటం మొదలుపెట్టాయి. హత్యచేసిన ఓ హంతకుని మనస్సులాగ నా మనస్సు కొట్టుమిట్టాడిపోయింది. నాలో ఏదో 'అద్భుతశక్తి ప్రవహిస్తున్నట్లు మరల అంతలోనే ఏదో ఎగా లోకంలో దొరకని అందం ఆనందం అతని చూపులలో లభ్యవౌతున్నట్లుగా అనుభూతిపొందాను.

అలా తృప్తిపొందటం, ఆలా అతనిని నేనుచూడటం తప్పా మేడమ్! వయస్సులో వున్న ప్రతిస్త్రీచేసే చేష్టలను నేనూచేశానేమో ననిపించింది అతన్ని చూచినప్పుడే నేను ప్రేమలోని మధురిమ ఏమిటో తెలిసికోగలిగాను.

ఆరోజంతా నామనస్సు అస్తవ్యస్తంగానే వుండిపోయింది. యాంత్రికంగానే పిల్లలకు పాఠాలు ఏమిచెప్పానో కూడా నాకు తెలియదు.

ప్రతివస్తువులోనూ అతని ప్రతిరూపమే! నిముష నిముషానికి ఆయన్ని గురించిన ఆలోచనలే నా తలలో కందిరీగల్లాగ రొద చేయసాగాయి. అతని ముగ్ధమోహనరూపమే నన్ను వివశురాల్ని చేసింది. అబ్బ! అంతఅందం యీ ప్రపంచంలో ఎవ్వరికీ వుండదేమో ననిపించింది. బహుశ ప్రేమంటే ఇదేనేమో.

పైగ అతని గుండెల్లో దాక్కొని వున్న అతని మంచితనం నన్ను ముగ్ధురాల్ని చేసింది. కాని ఆనాటిచూపు, అప్పటి హృదయంపేరు ఆ వయస్సులో ప్రతిస్త్రీ కన్పించిన ప్రతివ్యక్తిని అందగాడు, మంచివాడు, సహృదయుడనే సహజంగా అనుకుంటుంది గాబోలు! నేనూ అలాగే అనుకున్నాను. నదిలోని లోతు ఒడ్డున వుంటే ఎలా తెలుస్తుంది? అతని మంచితనం అతనిలో పూర్తిగ లీనమైపోయినప్పుడు తెలిసి వచ్చింది!

ఆరోజు రాత్రి నాకు నిజంగా నిద్రపట్టలేదు. అన్నీ ఆయన్నిగురించిన ఆలోచనలే! వాటికొక రూపంగాని, మొదలు తుదిగాని లేవు! అనంతప్రవాహంలా సాగిపోయాయి. ఆలోచనలు!

ఆరోజు అతను నాకు కన్పించడం ఓ వరమనుకున్నాను. తర్వాత అతన్ని గురించి నాకు తెలిసిన వివరాలివి. అతను డబ్బుతోపాటు పేరు ప్రఖ్యాతులు గడించిన ఓ డాక్టరని, అతనికి వివాహమైనదని, ఇద్దరుపిల్లలు కూడా వున్నారని! ఈ విషయాలన్నీ తెలిసికున్న తర్వాత నేను విధిచేత నలిగిపోయిన ఓ శాపగ్రస్తురాలి ననుకున్నాను. మనస్సు నెవరో సుత్తులతో కొడుతున్నట్లుగానే బాధపొందాను. అతని గురించిన ఆలోచనలను, అతని ప్రేమైక మూర్తిని క్రమంగా మర్చిపోవటానికి ప్రయత్నించాను.

నిర్లిప్తంగా మూగగా నాలుగు మాసాలు గడిచిపోయినై. ఓ రోజు రాత్రి వున్నట్లుండి నా ఒళ్లు పేలాలుగా పేలిపోవటం చూచి,

'అమ్మాయిగారూ! నాతో చెప్పలేదే! ఇంత జ్వరం కాస్తుంటే ఎలా వూరుకున్నారు.' అన్నాడు రంగన్న తాత నావంటిపై చేయివేసి చూస్తూ...

'ఇది మామూలు జ్వరమేలే తాతా! టెంపరేచర్ ఏమంతగా లేదులే' అన్నాను బాధగ. నిజానికి జ్వరం చాల తీవ్రంగానే వున్నది.

'మీ కెప్పుడూ యింతేలే అమ్మాయిగారూ! గుండెల్లో మంటలు మండుతున్నా మీరు చెప్పరు' అని నాపైదుప్పటి కప్పి డాక్టరును పిలుచుకువస్తానని వెళ్లిపోయాడు రంగన్నతాత.

ఓ అర్ధగంటను కాలం మింగివేసిన తర్వాత బైట స్కూటర్ హారన్‌మోత వినటంతో నేను చీర, దుప్పటి సర్దుకొని పడుకున్నాను.

బూట్లు టకటక లాడిస్తూ అతను నా గదిలోకి రావటంతో నన్నెవరో చెంపపై చాచి కొట్టినట్లయింది. అతనే, సందేహం లేదు. ఆ రోజు నేనుచూచిన వ్యక్తే! నాలో వెయ్యిబల్బులు వెలిగి ఆగిపోయాయి. నా హృదయాన్ని ఎవరో తట్టి లేపినట్లయింది. నేను జ్వరంతో బాధపడుతున్న మనిషిననే మర్చిపోయి నందన వనంలోని వనకన్యలా, పింఛంవిప్పిన నెమలిలా నా మనస్సు గంతులువేసి ఆగిపోయింది.

అతని చూపులు నాచూపులు మరోమారు కలిసికొన్నాయి. ఆ చూపులలోని వాడి వేడి నేను భరించలేక ప్రక్కకు తిరిగాను.

'ఏమండీ! మీరు మిస్. మంజుల లెక్చరర్ కదూ!' అన్నాడు. ఆకంఠంలో కోయిలలు పలికాయి.

'అవునన్నట్లు తలవూపాను' అతనిచ్చే థర్మామీటరును చేతిలోనికి తీసికొంటుంటే అతని వ్రేళ్లు నా వ్రేళ్లను తాకటంతో నాలో ఏవో భావనా తరంగాలు ప్రవహించినయ్. మరల నానుండి థర్మామీటరందుకొని పరీక్షించి 'అబ్బ, టెంపరేచర్ చాలా వున్నదండీ! మీరు పూర్తిగా విశ్రాంతి తీసికోవాలని, స్టెతస్కోపుతో నన్ను పరీక్షించి కొన్ని మందులు వ్రాసియిచ్చి మరల రేపు వస్తానంటూ అదో విధంగా నావైపు మరోమారు చూచి వెళ్లిపోయారు.

ఆ చూపు నేనిప్పటికీ మర్చిపోలే

ఆ మోవుతో నాలో అణగారిపోయిన అనేకమైన ఆశలు కోర్కెలు పెల్లుబికిపోయాయి.

ఈ విధంగా సాగిన మా పరిచయం. ఇంతై అంతంతై 'తప్పకుండా నిన్ను వివాహం చేసికుంటాను' అని అతను అనటం వరకు వచ్చింది.

'అతను వివాహితుడని తెలిసికూడా నీవు అతనికి ఎందుకు లొంగిపోయావు?' అని మీరనవచ్చు. నిజమే! నేనెందుకు, ఏవిధంగా అతనికి లొంగిపోయానో నాకర్థం కాదు. నా స్వార్థంతో నేను సుఖపడాలనే వాంఛతో, అతనిని నావాడ్ని చేసికోవాలన్న పేరాశతో, అతనిలో అలౌకికమైన అద్భుతప్రేమను నేను జుర్రుకోవాలన్న కాంక్షతో నేను లొంగిపోయాను. దీనికి తోడు అతను అప్పుడప్పుడు నాతో 'మంజూ! నీవులేనిదే నేనులేను. నాడాక్టరీ వృత్తినికూడా సక్రమంగా నెరవేర్చలేనేమో ననిపిస్తుంది. ఏమైనా నీవు నాకు కావాలి! తప్పక నా భార్యను వప్పించి త్వరలోనే నిన్ను వివాహం చేసికుంటాను. నా భార్య ఒప్పుకోదని అనుమానిస్తున్నావా? ఆమె చాల యోగ్యురాలు! విశాలహృదయురాలు! నా సుఖంకన్న యీ ప్రపంచంలో ఆమెకు మరేమీ అక్కరలేదు. తప్పక ఆమె అంగీకరిస్తుంది!' అనే వారిమాటలు నాలో జీవంపోసి మరింతగ నాకలలకు బలాన్ని చేకూర్చాయి.

* * *

ఓ శుభ ముహూర్తాన వేమిరుపురము గుళ్ళో పెళ్లిచేసికొని అతని యింటికి వెళ్ళాము. నాలో ఏదో భయం భీతి ఆవరించి నన్ను అదరగొట్టటం మొదలు పెట్టాయి. ఆమె నన్నెంతగానో చీదరించుకుంటుందని, అసహ్యించుకొంటుందని; నానామాటలు మాట్లాడుతుందని, వయ్యారి వంచకినని, కపటినని దూషిస్తుందని ఏవేవో తలపోసిన నేను ఆమె నాపట్ల చూపిన ప్రేమకు, ఆదరణకు పూర్తిగ వివశురాల్ని అయిపోయాను. నా హృదయం ఆమెపట్ల పశ్చాత్తాపాగ్నితో దగ్ధమైపోయింది. దేవతామూర్తియైన ఈ స్త్రీకి నే నెలా ద్రోహంచేశాను? నేనొక స్త్రీనేనా? పాటిస్త్రీకి అన్యాయంచేసి నేను సుఖపడగలనా? అని ఎంతెంతగానో నిందించుకున్నాను.

అదేరోజు రాత్రి ఆమె పెట్టెలోని నీలం పట్టుచీర, రవ్వల నెక్లెస్‌యిచ్చి కట్టుకోమని చెప్పి, నెక్లెస్ నాకంఠంలో పెట్టటం లాంటి పనులు చేస్తుంటే నేనొక పిచ్చిదానిలా 'అమ్మా! నీత్యాగం నేను భరింపలేను' అని అరవాలనిపించింది. స్త్రీ సమస్త భోగభాగ్యాలను తృణప్రాయంగా మరొక స్త్రీకి అర్పిస్తుందేగాని ప్రాణసఖుని యివ్వగలుగుతుందా అంటే యివ్వలేదు. అందుకే ఈమె దేవతామూర్తి అనుకొని ఆమెలోని దేవతకు లోలోనే అంజలి ఘటించాను. ఆమెను వేనోళ్ల పొగుడుకున్నాను. శ్లాఘించాను.

ఓ రోజు ఉదయాన్నే కాఫీలవి ముగించిన తర్వాత నేను జడ అల్లుకుంటూ 'ఏమండీ! టేబిల్‌మీద నాపెన్ను లేదే!' అన్నాను హాలులోకి వస్తున్న ఆమె నుద్దేశించి...


ఆమె సన్నగానవ్వుతూ 'ఇదిగో చెల్లీ! నన్ను ఏమండీ అని గౌరవంగా పిలవనక్కరలేదు. అలాఅంటే నాకేదో లాగ వుంటుంది. నన్నొక పరాయివ్యక్తిగా భావిస్తున్నావన్నమాట అలా పిలిస్తే నాకు కోపంవస్తుంది. మనలో మనకు ఈ మర్యాదలేమిటి?' అన్నది అల్లుకొనే నాజడను తన చేతిలోకి తీసికొని అల్లుతూ సన్నగా రహస్యంగా చెవిలో 'నన్ను అక్కా' అని పిలువు! తెలిసిందా?' అన్నది.

ఆమాటకు నేను నిజంగా స్తబ్ధురాలినై పోయాను. ఆమెకున్నంత విశాల హృదయం ప్రపంచంలో ఎవ్వరికీ వుండదేమో ననిపించింది. ఆమెలో వున్నంత మంచితనం మరెక్కడా ఎవ్వరిలో కన్పించదేమో ననిపించింది.

ఆ రోజు నుండి నేను ఆమెను 'అక్కయ్యా' అని పిలవటం ప్రారంభించాను.

మా ముగ్గురిమధ్య అంటే వారిమధ్య అక్కయ్యమధ్య—ఏవిధమైన పొరపొచ్చాలు లేకుండ ఎంతో హాయిగ ఆనందంగ కాలం సాగిపోయింది. ప్రపంచంలో నా అంత అదృష్టవంతురాలు మరెవ్వరూ లేదన్న గర్వంతో అహంకారమైన దర్పంతో నేను కాలం గడపసాగాను.

నేను వెళ్లిన సంవత్సరంలోపునే నాకు గర్భం రానటంలో అక్కయ్యలో ఈర్ష్యను, స్వార్థాన్ని, పగను ప్రస్ఫుటముగ చూడగలిగాను. రానురాను ఆమె నాపట్ల ద్వేషంతో తిరస్కారభావంతో, చీదరింపుతో వ్యవహరించటం నేను గమనించకపోలేదు. వారునేనూ సాయంకాలం ఆరుబైట కూర్చొని కాలేజీకబుర్లు — హాస్పిటల్‌లోని విశేషాలగురించి చర్చించుకొంటున్నా నామాటలు పట్టించుకోకుండ నిర్లిప్తంగ పట్టనట్లుగవుండి సిల్లులచేత లేదా పని



ఇసుమంతైనా కోటి కిలాంటిదాని విరిగి తన్ను చంపబోయేట ఫోస్తూ నేనువ్వాను. ఆమెలో మార్పు అద్దంలోని ప్రతిబింబంలా కన్పిస్తుంది.

సాయంకాలం కాలేజీనుండి యింటికి వచ్చినతర్వాత 'అక్కా! ఈ పుస్తకం చదువు ఎంతో బాగున్నది' అన్నాను ఆనందంతో ఓ నవలచేత కందిస్తూ... ఆమాటలతో అక్కయ్యముఖంలోని రంగులు మారాయి. ఏంతో చిదరింపుగ తిరస్కార భావంగ ముఖం చిట్లించుకొని 'కాలేజీలో లెక్చరర్లుగా పనిచేసేవాళ్లు చదివితే అర్థమవుతాయి కాని నాకేలా అర్థమవుతాయి?' అని చరచరా వంటింటివైపు వెళ్ళిపోయింది.

ఆమెలో ఊహించని ఈ మార్పుకు నేనెంతగానో నొచ్చుకున్నాను. నాలోనూ నాకుతాను నైరాశ్యం బాగుప్పయేర్పడ సాగింది. పిల్లలనుకూడ నాతో చేరవగా వుండనివ్వకుండ జేసింది.

హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి కారణమేమిటో వారినడిగితే నాకు చెప్పకుండ మౌనంగ వుండిపోయారు. దాదాపు వారుకూడ నావిషయం పట్టనట్లుగ, అంటీ అంటనట్లుగ తిరగటం మొదలుపెట్టారు. ఈమార్పు నాగుండెల్లో తుఫానులను రేపింది నేనింకా ఎటువంటి


# తప్పెవరిది?

దుర్భర పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుందోనని ఆందోళన చెందాను.

నాకు పూర్తిగ నెలలునిండాయి. ఆరోజు అక్టోబరు నాల్గవతేదీ. ఆరోజు నా ఆశలు కలలు ఫలించినరోజు నా జీవితానికి ఓ అర్థాన్ని ఆనందాన్ని యిచ్చినరోజు. నాకు పండంటికొడుకు పుట్టాడు. నాలో వెయ్యి వసంతాలు వెల్లివిరిసాయి. నా ఆనందానికి అవధులులేవు. ఏదో సాధించలేని విజయాన్ని సాధించినంతగా తృప్తిపొందాను.

అప్పటినుండి అక్కయ్య దాదాపు నాతో ముభావంగ వుండటం ప్రారంభించింది. నా ఆశల ఫలమైన, నా ప్రేమకు ప్రతిఫలమైన బాబుకు 'కిషోర్'అని పేరు పెట్టుకున్నాను.

వారిమధ్య—నామధ్య—అక్కయ్య మధ్య కాలం ముభావంగ నిరాశగ జరిగిపోతూనే వుంది. అక్కయ్య నామీద చీటికిమాటికి చిదరించుకుంటుంది. పెదబాబు నా బాబుతో ఫూసులాడుకొంటుంటే బలవంతానా, పులిలా ఆమె బాబును లాక్కుపోతుంది. ఇదంతా గమనించిన నేను మూగగ యేడ్చుకుంటాను ఆమె మౌనం నన్ను నిలువునా దహించివేస్తుంది. దాదాపు నాకు కావలసిన సౌకర్యాలన్నీ పనిమనిషే




చూస్తుంది. వారు యిద్దరిమధ్య నారు మౌనంగానే వుండిపోవటంతో నాలోమరింతగ అగ్నిజ్వాల బయలుదేరింది. అనుకోకుండానే ఆరుమాసాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

ఆరోజు కాలేజీకి శెలవుకావటంవలన నేను కాలేజీకి వెళ్లలేదు నాగదిలో బాబును పడుకోబెట్టుకుని ఏవేవో గతస్మృతులను నెమరువేసికొంటున్న సమయంలో 'మంజూ' అనే భీకరకంఠస్వరానికి అదిరిపడి గబగబ గదిలోనుండి బైటకువచ్చి అక్కయ్య ఆకారాన్ని చూచి ఆశ్చర్యపోయాను.

ఆమెలోని పౌరుషం మరగలు కక్కుతుంది. ఆవేశంతో కోపంతో ఆమె ఎద ఎగిసి ఎగిసిపడుతుంది. కళ్లు చింత నిప్పులా మండిపోతున్నాయి. జుట్టుగిట్టా విరబోసుకుని వికృతరూపం దాల్చిన వింత రాక్షసిలావున్నదామె.

నాకు మతిపోయినంత పనయింది. ఏమి మాట్లాడాలో తోచక ఏదో ఒకటి అడగాలికదా అనేభావంతో 'ఏమిటక్కా ఎందుకలావున్నావు!' అన్నాను ఆమెదగ్గరకు వస్తూ...

'అక్కా! కుక్కా! నేసిన ద్రోహం చాలు! నెరజాణవే! ఈ యింట్లో నీవైనా వుండాలి! నేనైనా ఉండాలి! తక్షణం నీవు ఈయింట్లోనుండి వెళ్లిపోవాలి. నేనీరంపపుకోతను భరింపలేను. నాభర్త—నీవు కులుకుతూవుంటే యింక నేను చూచి భరింపలేను నాలో యింక ఆశక్తిలేదు. నీవు వెళ్లిపోవాలి! లేదా! నేను ఆత్మహత్యచేసికుంటాను నా వుసురు నీకు తప్పకుండ తగులుతుంది' గడగడ నాల్గుమాటలు అనేసి వెళ్లిపోయింది.

నాక్రింది భూమి కృంగిపోయినట్లుయింది. నేను నిర్మించుకున్న సౌధాలన్నీ కుప్పకూలిపోయాయి. ప్రకృతంతా స్తంభించిపోయినట్లనిపించింది. నేనెందుకో ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపడక అప్పట్లో అది సహజమేనేమో అనుకున్నాను.

ఆసంఘటన జరిగినదగ్గరినుండివారితో నేను దాదాపు మూగదానిలా ప్రవర్తిస్తుతూ ప్రిన్సిపాల్ గారిని ప్రతిమాలి, ఎన్నెన్నో కష్టనష్టాల కోర్చుకొని, ఎంతో ప్రయాసతో నేను విశాఖపట్నం ట్రాన్స్ఫర్ చేయించుకొని నాబాబుతోసహా యిక్కడికి వచ్చేశాను.

మంజుల చెప్పటం ఆపింది।

మేడమ్ ! నేను మొదటినుండి నష్ట జాతకురాలినే ! నా తల్లిదండ్రు లెవ్వరో నాకు తెలియదు. కాలుజారిన ఓ కన్య సంతానాన్ని నేను శిశాలయంలో 'కేర్ కేర్' మని ఏడుస్తున్న నన్ను ఓ వర ప్రసాదంగా భావించి ఆండాళ్లమ్మగారు నన్ను పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించారు. పైగా ఆమె తదనంతరం వున్నకొద్ది ఆస్థీ నాపేర వ్రాసి ఆండాళ్లమ్మగారు కన్నుమూసారు.

జీవితంలో నేనెవ్వరివలన యింత వున్నతస్థితికి వచ్చానో, ఎవరిచేతి చలువ వలన యింతటి దానను కాగలిగానో ఆమెకూడ పోవటంతో నాకంతా శూన్యంగ కన్పించింది అయినా నన్ను నేను నిల దొక్కుకున్నాను మరల బ్రతుకుమీద ఆశను కల్పించుకున్నాను కేవలం నాబాబు కోసరం బ్రతుకుతున్నాను మేడమ్ !

ఆనాడు నా తల్లిదండ్రు లెవ్వరో తెలియక నేను అనాధనై పోయాను తల్లి తండ్రి వుండికూడ నాబాబు యీనాడు ఓ కాన్వెంటులో గోప్యంగా పెంచబడు తున్నాడు సంఘం నాపై చిన్నచూపు చూచింది నన్ను హేళనచేసింది నాగురించి కాలేజీ స్టూడెంట్సు కథలు కథలుగా అల్లి చెప్పుకొంటున్నా విని సహించాను నాలో యింక సహనంలేదు మేడమ్ !

నాకు అన్నీ వున్నాయి అన్నారు ! ఈ వుద్యోగం, ఈ హోదా, ఈ అంతస్థు నాకివేమి అక్కరలేదు పరిపూర్ణమైన ప్రేమ, మనశ్శాంతి నాకు కావల్సింది మేడమ్ ! వారు నన్ను మోసం చేశారు దగా చేశారు.'

మరల చెప్పటం ప్రారంభించింది.

'మామూలుగా ఆ రోజు నేను కాలేజీ నుండి వచ్చేసరికి నాకోసరం ఓ లెటర్ ఎదురు చూస్తున్నది పరిచయమైన దస్తూరియైనా నాలో ఏదో భయం మొలకెత్తింది. వణికే చేతులతో గబగబ వుత్తరం చింపి చదివాను.

ప్రియమైన మంజులకు,

నీవు నేను హాస్పిటల్‌కు వెళ్లిపోయిన తర్వాత మీ అక్కతో ఘర్షణపడి వెళ్లి పోయావని తెలిసికొని బాధపొందాను. విహాళ నీవు వెళ్లటమే సముచిత మని పించింది నాకు ఎందుకంటే నీకు సంఘంలో విలువవున్నది. హోదావున్నది పైగ నీచేతిలో ఓ మంచి వుద్యోగంవున్నది నీ జీవితాంతం నీవు ఎలాగైన బ్రతకగలవు నా భార్యకు నేనుతప్ప ఎవ్వరూలేరు. నేను లేకపోతే ఆవిడ జీవించదు. ఆవిడకు నేను ద్రోహం చేశానని ఆలస్యంగ తెలిసికున్నందుకు చింతిస్తున్నాను నీ సమక్షంలో నేనుంటే ఆమె జీవించదు నా భార్య నాబిడ్డలు నాకు దాకుండపోతారు 'అనుక నీవు గతాన్ని మర్చిపోయి మరెవరైనా వివాహం చేసికొని సుఖించు. నన్ను మన్నిస్తావు కదూ!

ఇట్లు


చంద్రశేఖరం.

ఆ వుత్తరం చదివి నేను ఎన్ని రోజులు ఏడ్చానో మీకెలాచెప్పను మేడమ్! నేను శిలనైపోయాను నాకు హృదయం లేదు. నేను మనిషినికాను నేను చచ్చిపోతే బాగుండునని బాధపడుతున్నాను కాని నా బాబుకోసరం బ్రతుకుతున్నాను.

మేడమ్! మీరే చెప్పండి!

పురుషుని ప్రేమ. అనురాగంలోపడి కన్నుమిన్ను కానకుండ, ముందు వెనుకలు ఆలోచించకుండ అతనికి నా సర్వసం అర్పించి అతనిలో ఐక్యమై పోవటం నాతప్పా? లేక అన్నం పున్నెం ఎరుగని కన్యలో ఎన్నెన్నో ఆశలు రేకెత్తించి ఏవేవో వూహాసౌధాలు నిర్మించి వలపించి వాంఛించటం అతనితప్పా? లేక.

వంట మనిషి దొరక్క నాన్న అవస్థపడుతున్నారని
కాలేజీలో చదివే మా వారికి సమయానికి
...



భర్త మరో స్త్రీని పెళ్లిచేసికున్నా సహించి, అందుకు ఆమె దీర్ఘ సౌటి సీని ప్రేమగ ఆశీర్వదించి అమృతం చిలికించి మరల అంతలోనే ద్వేషించి దూషించి యింటినుండి గెంటివేయుటం ఆమెది తప్పా? మా ముగ్గురిలో తప్పెవరిది మేడమ్?' అన్నది ఆమెను నిగ్గదీసి అడుగుతున్నట్లు ఆవేశంతో అరిచింది.

'పిచ్చిపిల్లా, ఎందుకలా ఆవేశపడతావ్! ఆవేశంతో చేసినపనులు అనర్థదాయకం గానే వుంటాయి నేను మీ ముగ్గురిదీ తప్పేనంటాను కాని సంఘం నీదే తప్పని దుమ్మెత్తిపోస్తుంది డాక్టరుగారి భార్యపై సానుభూతి చూపుతుంది. పైగ డాక్టరును, అతనికేం? అతను మగవాడు. అతను ఏంచేసినా చెల్లుతుంది?' అని లోకం సమర్థిస్తుంది. అంతేకాదు. భార్య వున్నదని తెలిసికూడ ఆమె వాళ్ల పచ్చని సంసారంలో నిప్పు లెందుకు పోయాలి ?' అని నిందిస్తుంది. ఇంకా యీ లోకం నీలాంటివారిపై, కాలుజారిన కన్యలపై సానుభూతిచూపి చేటంతగా యింకా ఎదగలేదమ్మా ! మన సంఘం యింకా అంతపైకి రాలేదు.' అన్నది లాలింపు కంఠంలోనింపి 'అయితే వాదే తప్పంటారా మేడమ్ !' అంటూ రెండు చేతులతో ముఖాన్ని కప్పుకొని కుళ్లి కుళ్లి యేడ్చింది మంజుల

ఆమెను ఓదార్చేశక్తి ఎవ్వరికీ లేదు. వసుంధర మేడమ్ అలాగే చూస్తూ వుండిపోయింది. అప్పటికే బీచ్‌లో పురుగు కూడ లేదు. ఎనిమిది గంటల కావస్తుంది. కాటుకలాంటి చీకటిని పారద్రోలుతూ వీధులలో విద్యుద్దీపాలు దేదీప్యమానంగా పవిత్రస్త్రీ పాతివ్రత్యంలాగ వెలిగిపోతున్నాయి. చీర విదిలించుకొని పైకి లేస్తూ వసుంధర మేడమ్ మంజులను చేతితో పట్టుకొని కారువైపు నడిచింది

మంజుల వెక్కిళ్లు యింకా తగ్గ లేదు. ఈదురుగాలి ఈర్ష్యగ వీస్తున్నట్లనిపించి చలి పుడుతున్నట్లుగ పవిటను నిండుగా కప్పుకుంది మంజుల,

ఇద్దరూ కార్లో కూర్చున్నారు

సిమెంట్‌రోడ్డును కోసుకుంటు కారు బాణంలా హాస్పటల్ వైపు దూసుకుపోయింది. ●